# కామెడీ కథ

-డా. ఎమ్. సుగుణరావు

# సెల్(లో) బాంబు

**ఆ హైటెక్ బస్ ఎక్కగానే గుండెలు జారిపోయాయి రాంబాబుకి. డ్రైవర్ చేతిలో ఒకటి, జేబులో ఒకటి మొత్తం రెండు సెల్‌ఫోనులు.**

ఇదివరకూ ఆ బస్సే ఎక్కాడు హైదరాబాదు వెళ్ళ దానికి. ఆ డ్రైవర్ ఆరోజు రెండు ఫోన్లతో మాట్లాడుతూ ఒక చేత్తో బస్సు నడుపుతూ రాంబాబుకు మరణమృదంగం వినిపించాడు.

'తెల్లారితే ఇంటర్వ్యూ, ప్రశాంతంగా నిద్రపోదామనుకుంటే ఈ సెల్ గోల తప్పదా' అనుకున్నాడు. ఇంతలో ఎవరిదో సెల్ మోగింది.

"అమ్మాయ్, నేను నాంపల్లిలో దిగి ఆటో వేసుకుని వచ్చేస్తాను, నువ్ సాంబారు చేసి ఫ్రిజ్‌లో పెట్టు..ఏంటీ? సాంబారు ఎలా చెయ్యాలో రాదా! రాసుకో..ఏంటీ, మళ్ళీ చేస్తావా!" ఫోను ఆగింది.

'బాబోయ్ ఇక నాకు సాంబారు మీద క్లాసు అనుకుంటా, రేపు ఇంటర్వ్యూలో ఏం అడిగినా సాంబారు గురించే వినిపిస్తాను కాబోలు' అనుకున్నాడు.

బస్సు కదిలింది. 'బ్రతుకుజీవుడా, ఏ ఫోనూ మోగ ట్లేదు, ఓ కునుకుతీస్తా..' అనుకుంటూ కళ్ళు మూసుకున్నాడు. ఇంతలో ఎవరి పిల్లాడో గుక్కపట్టి ఏడుస్తున్నాడు. ఆ ఏడుపు అవిరామంగా నిమిషంపాటు సాగింది. ఇక ఓపిక నశించింది కాబోలు, పక్క సీట్లో ఆవిడ "ఏవమ్మా పిల్లవాడు అలా గుక్క పెట్టి ఏడుస్తుంటే పాలివ్వచ్చు కదా..ఈ కాలం తల్లులు పాలెందుకిస్తారు? సౌందర్య పోషణ తప్ప శిశుపోషణ లేదు"

-ఆవిడ మాటలకు ఆ అమ్మాయి కిసుక్కుమని నవ్వి "ఇదిగోనండీ నా పిల్లాడు" అంటూ తన చేతిలోని దాన్ని చూపించింది. "అయ్యో నా మతిమండా రింగ్‌టోనా" అంటూ ఆవిడా నవ్వేసింది.

ఆ నవ్వుల నేపథ్యంలో రాంబాబు నిద్ర మాయమయింది. మళ్ళీ కళ్ళు మూసాడు. కిటికీలోంచి చల్లటి గాలి, 'అమ్మయ్య రెప్పలు మూసుకుంటున్నాయి' మెల్లగా నిద్రకు జారుకునేంతలో.. "చెప్పు" అనే భీకరమైన స్వరం.

"సెల్ నించి మాట్లాడుతున్నావా? అర్థమయింది ఆ మాత్రం తెలీదా? నీ నెంబరు కనిపిస్తోంది కదా...మళ్ళీ ఏమిటా పిచ్చివాగుడు సెల్ నించి సెల్లా! అంటే..అంటే..ఓరి నీ అసాధ్యం గూలా! నిజంగా సెల్ నించే అంటే జైలుగది నించే మాట్లాడుతున్నావా, సెల్ మాట్లాడుతూ స్కూటర్ డ్రైవ్ చేసి ఎవరినో గుద్దినందుకు సెల్‌లో వేసారా..మా బాగా అయింది..సెల్ నించి సెల్.." ఆ వ్యక్తి ఫోనులోనే వికటాట్టహాసం చేసాడు.

-ఆ నవ్వుతో మళ్ళీ గుండెలు జారినట్టయింది రాంబాబుకు.. 'మైగాడ్..బస్సు ఇంకా అనకాపల్లి దాట లేదు..రాత్రంతా ఈ సెల్ వాగుడేనా ఏదీ దారి?' అనుకున్నాడు.

"ఆ చెపుతున్నాను విను, పప్పు ఉడకబెట్టేసావా?...దాంట్లో చింతపండు పులుసు వేసి..బాగా కలియబెట్టి...మళ్ళీ ఫోన్ చేస్తావా?"

సాంబారు తయారీపై సెల్‌ఫోన్‌లో శిక్షణా కార్యక్రమం రాంబాబుకు నవ్వొచ్చింది. అంతవరకూ తన పక్కన కూర్చున్న వ్యక్తిని గమనించలేదు. పొడుగ్గా, జులపాలుగా వేళ్ళాడుతున్న జుట్టు..తెల్లటి లాల్చీ పైజమా.

"సార్ ఎక్కడకు వెళుతున్నారు" ఆయనే అడిగాడు.

"ఇంటర్వ్యూ వుంది మరి మీరు" అన్నాడు రాంబాబు.

"రవీంద్రభారతిలో కవి సమ్మేళనం. కవితా సంపుటి ఆవిష్కరణ, దాంట్లో నేను రాసిన కవిత వుంది" అన్నాడాయన.

"కవితా సంపుటి పేరు" అడిగేడు రాంబాబు.

"సెల్ మోహనరంగ సెల్‌ఫోనుల మీద వార్షిక సంచిక"

"ఓహో" అంటూ మౌనంగా ఊరుకున్నాడు రాంబాబు. సంభాషణ పొడిగిస్తే ఎక్కడ ఆ కవిత వినిపిస్తాడోనని.

ఇంతలో మళ్ళీ ఫోన్. సాంబారు ఆంటీగారి స్వరం.

"ఏంటీ, సెల్‌ఫోన్ నించి కాకుండా లేండ్‌లైను నుంచి చేస్తున్నావా? సెల్‌ఫోన్ పప్పుపులుసులో పడిందా అయ్యో..దిక్కుమాలిన సాంబారు నేర్చుకోవడం కోసం, పదివేల రూపాయల సెల్‌ఫోన్ పాడయ్యిందా..గోవిందా.."

ఆవిడ లబోదిబోమంటూ సెల్‌ఫోనులోనే శోకాలు పెడుతోంది.

'పీడ విరగడయ్యింది, ఇక సెల్‌ఫోనులో సాంబారుపై శిక్షణా కార్యక్రమం లేదు' అనుకున్నాడు రాంబాబు.

"సార్ ఈ అరటిపండు తినండి.." సెల్ మోహనరంగా కవిగారు అందించిన అరటిపండు తినేసాడు.

"ఈ బిస్కట్లు తినండి, బావుంటాయి" అంటూ బిస్కట్ పాకెట్టులోని సగం బిస్కెట్లు రాంబాబుకు ఇచ్చాడు. ఐదు నిమిషాల్లో వాటిని తినడం పూర్తి చేసిన వెంటనే "ఇప్పుడు నోట్లో ఈ చూయింగ్ గమ్ వేసుకోండి నోరంతా పరిమళ భరితం" అన్నాడు ఆ కవిగారు.

చూయింగ్‌గమ్ నములుతూ రాంబాబు ఆలోచనలోపడ్డాడు. "ఈ కవిగారు నాకు అన్నీ తినిపిస్తున్నారు..పాపం చాలా మంచివారేమో" అనుకున్నాడు. ఐదు నిమిషాల తర్వాత ఆ కవిగారు తన భుజాన తగిలించిన చేతి సంచిలోంచి డైరీ తీసి "సార్ నా సెల్‌ఫోన్ కవిత చదువుతాను వినండి" అన్నాడు.

అప్పుడు రాంబాబుకు అసలు విషయం అర్థమయింది. 'ఇదీ సంగతి, బలికి ముందు మేకపిల్లను మేపినట్టు, తనను మేపడం వెనుక ఇంత కుట్రా, తనను ఈయన కవితకు బలి ఇవ్వడానికా' అనుకుంటూ రాంబాబు విధి లేక "చదవండి సార్.." అన్నాడు నీరసంగా నవ్వుతూ.

"కణమా! కణమా! నువ్వే నా ప్రాణమా!" అంటూ ఆయన మొదలుపెట్టగానే.."ఏంటి సార్, కణం అంటున్నారు" అన్నాడు రాంబాబు అయోమయంగా.

"అదే సార్ సెల్ అంటే కణమే కదా" అంటూ తన కవితను రాగయుక్తంగా చదవడం మొదలుపెట్టాడు.


"కణమా, కణమా నువ్వే నా మెడకు తోరణమా
నువ్వే నాకు అసలు సిసలు ఆభరణమా!
నువ్వే నాకు ప్రేరణమా, బ్రతుకు పాటకు చరణమా!
నువ్ లేకుంటే నాకు మరణమే శరణ్యమా"

-అలా కవిగారు పాడుతూ "దీనికి ఇంగ్లీషు అనువాదం కూడా వుంది.. ఓ మెడియర్ సెల్, వితౌట్ యు మై లైఫ్ ఈజ్ హెల్" అంటూ ఇంగ్లీషులో పాట మొదలుపెట్టగానే రాంబాబు నిద్రలోకి జారుకుని గురక తియ్యడం ప్రారంభించాడు.

* * *

"ఎవడ్రా..నా సెల్‌కు మిస్సుడు కాల్ ఇచ్చింది, అడ్డంగా నరికేస్తా..అసలు నన్నేమనుకుంటున్నావురా" రాంబాబు ఆ కేకలకు ఉలిక్కిపడి లేచాడు. వెనక సీటులో వ్యక్తి అరుస్తున్నాడు.

'అబ్బ నాకు ఈ రాత్రి జాగారం లాగే వుంది. కళ్ళు నిద్రలేక మంటపెడుతున్నాయి' అనుకున్నాడు. మళ్ళీ నిద్రకు ఉపక్రమించుదామనుకునేంతలో ప్రక్కన కవిగారు సెల్‌ఫోనులోనే తన కవిత ఎవరికో వినిపిస్తు



న్నారు. ఇంతలో "కొక్కొరోకో..కొక్కొరోకో" అంటూ కోడికూత. "లెగండి. లెగండి తెల్లారిపోయింది" ఒకాయన తన కుటుంబ సభ్యుల్ని లేపుతున్నాడు.

"ఏమిటీ లెగడం..అది కోడికూత కాదు. సెల్‌ఫోన్ మోత. బస్సు ఇంకా తుని దాటలేదు" ఇంకొక వ్యక్తి గట్టిగా అరిచాడు.

రాంబాబుకు ఒక్కసారిగా వళ్ళుమండింది. కోపం ముంచుకొచ్చింది. 'ఈ రాత్రి హాయిగా నిద్రపోతే రేపు ఇంటర్వ్యూ ప్రశాంతంగా సాగుతుంది. మరి ఈ సిల్లీ ఫోనులతో నిద్రపట్టి చావడం లేదు..ఏమిటీ మార్గం' అంటూ ఆలోచనలోపడ్డాడు. నిమిషం తర్వాత రాంబాబు బుర్రలో ఐడియా మెరిసింది. తన జేబులోంచి సెల్‌ఫోన్ తీసాడు. దాన్ని చెవి దగ్గర పెట్టి, ఒక్కసారిగా "మైగాడ్" అంటూ అరిచాడు. అందరూ రాంబాబు వంక ఆశ్చర్యంగాను, కోపంగాను చూసారు. నిద్రలో జోగుతున్నవారు కూడా మెలకువలోకి వచ్చారు అతడి అరుపులకు. రాంబాబు గొంతు సవరించుకుని ఆందోళనగా చెప్పాడు. "ఇప్పుడే నాకు పోలీస్ కంట్రోల్ రూము నుంచి ఫోన్ వచ్చింది, కొన్ని సెల్‌ఫోన్ సిమ్‌కార్డుల్లో బాంబు పెట్టారట. అవి మన బస్సులో ప్రయాణికుల ఫోన్లలో వుండవచ్చునని అనుమానం. ఏ సిమ్‌కార్డుల్లో ఏ సీమబాంబు వుందో ఎవరం చెప్పగలం? దయచేసి అందరం సెల్‌ఫోనులు ఆపేద్దాం. హైదరాబాదు వచ్చేవరకూ ఇంక సెల్‌ఫోన్ కూతలు వినిపించకూడదు. అది అందరికీ మంచిది. మన ప్రాణాలు భద్రంగా వుండాలంటే, మనం హైదరాబాదు సురక్షితంగా చేరాలంటే అందరూ వారి వారి సెల్‌ఫోనులను కట్టెయ్య ప్రార్థన" అన్నాడు రాంబాబు.

"డోంట్ బీ సిల్లీ..నేను నమ్మను" ఎవరో ఒకాయన అన్నాడు.

"ఔను..అంతా ఉత్తిదే..అలా జరిగే అవకాశం లేదు" ఇంకొక వ్యక్తి ఆయనకు మద్దతు పలికాడు. "లేదండీ అలా జరిగే అవకాశమూ వుంది, ఈమధ్య ఏదో సినిమాలో సెల్‌ఫోనులో బాంబు పెట్టి వందమందిని చంపినట్టు చూపించారు" ఇంకో ఆయన చెప్పాడు.

"ఔను, ఎందుకు కోరి ప్రమాదం తెచ్చుకోవడం.." ఇంకో ఆయన రాంబాబుకు వత్తాసు పలికాడు.

పావుగంటసేపు వాదోపవాదాలు.

ఆఖరికి రాంబాబు భయానక ప్రకటన అందరినీ భయపెట్టడంతో అందరి సెల్‌ఫోనులు మూసుకున్నాయి.

రాంబాబు ప్రశాంతంగా నిద్రలోకి జారుకున్నాడు.

★ ★ ★

తరువాతి రోజు ఇంటర్వ్యూ పూర్తిచేసి తను దిగిన హోటల్ రూములో రిలాక్సవుతున్నాడు రాంబాబు.

టీవీ ఆన్ చేసాడు. ఏదో చానల్‌లో వార్తాకథనం.

"విశాఖపట్నం నుంచి హైదరాబాదు వస్తున్న హైటెక్ బస్సులో సెల్‌ఫోనులో పెట్టిన బాంబు పేలింది, ఆ బస్సులో ప్రయాణించిన వారి మనోభావాలు, వారితో
ప్రయాణం చేసిన మా ఛానల్ రిపోర్టర్ ప్రత్యక్ష కథనం ద్వారా వినండి, బ్రేక్ తర్వాత"

ఆ టీవీ ప్రకటనకు ఆశ్చర్యంలోపడిన రాంబాబు, 'అబ్బ తను పెట్టిన బాంబుకన్నా, ఇంకా పెద్దబాంబు పేల్చాడు ఆ ఛానల్ రిపోర్టర్' అనుకుంటూ వెంటనే ఛానల్ మార్చేసాడు రాంబాబు.

☆